

ఆర్టీసీ బస్‌లో బస్ భవన్‌కు వెళ్తూ ప్రయాణికురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు సబితారెడ్డి, సుధీర్‌రెడ్డి



ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డిని అదుపులోకి తీసుకుంటున్న పోలీసులు



ఎమ్మెల్యేలు సబితారెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ వాణీదేవి తదితరులను అంబర్‌పేట్‌లో అరెస్ట్ చేసిన పోలీసులు

ప్రజా ప్రభుత్వంలో ఆర్టీసీ ప్రయాణికులపై భారం

ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ప్రజలను ఏమార్చి అధికారంలోకి వచ్చిన ప్రజాప్రభుత్వంలో పాలకులు ప్రజలను ముప్పుతిప్పలు పెడుతున్నారని ఎమ్మెల్యేలు సబితా ఇంద్రారెడ్డి, దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి విమర్శించారు. ఆర్టీసీ బస్సు చార్జీల పెంపుదలను నిరసిస్తు బీఆర్ఎస్ పార్టీ ఇచ్చిన చలో బస్ భవన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సబితా ఇంద్రారెడ్డి, సుధీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ సురబి వాణీదేవితో పాటు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు దిల్‌సుఖ్‌నగర్ నుంచి బస్‌లో బస్‌భవన్‌కు బయలుదేరారు. విషయం తెలుసుకున్న పోలీసులు అంబర్‌పేట వద్ద బస్‌ను ఆపి, వారిని అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం ఇచ్చిన ప్రజలకు మేలు చేయాల్సిన ప్రజాప్రభుత్వం ఆర్టీసీ బస్సు చార్జీలను పెంచి వారికి మొట్టికాయలు వేస్తున్నదన్నారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను సైతం అమలు చేయకుండా బకాయి పడ్డారన్నారు. పెంచిన బస్‌చార్జీలను తక్షణమే ఉపసంహరించుకోవాలని వారు డిమాండ్ చేశారు. కొద్దిసేపటి తర్వాత వారిని విడిచిపెట్టడంతో వారంతా బస్ భవన్‌కు తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లాగ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సత్తు వెంకటరమణారెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి సమస్యకు శాశ్వత పరిష్కారం

ఎంపీ ఈటల రాజేందర్



ఎంపీ రాజేందర్‌కు వరదనీటి సమస్యలను వివరిస్తున్న కార్పొరేటర్

వనస్థలిపురం,అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వరదనీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చేపడుతామని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్‌లో ఇటీవల వరద ముంపునకు గురైన గాంధీనగర్, అఖిలాండేశ్వరీనగర్, స్నేహమాయినగర్, పద్మావతి కాలనీ, పీవీఆర్ కాలనీల్లో స్థానిక కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డితో కలిసి ఎంపీ ఈటల రాజేందర్ గురువారం పర్యటించి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ లచ్చిరెడ్డి మాట్లాడుతూ వర్షం కురిసిన ప్రతిసారి పైకాలనీల నుంచి వరదనీరు రావడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఇట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలన్నారు. స్పందించిన ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ వరదనీటి సమస్యల పరిష్కారానికి భారీ స్ట్రామ్ వాటర్ డ్రైన్ నిర్మాణం చేపట్టాలన్నారు. సంబంధిత జలమండలి, ఇరిగేషన్, హైడ్రా, మున్సిపల్ అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కారానికి శాశ్వత పరిష్కారం చేపడుతామన్నారు. కాలనీవాసులు సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని ఈటల హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షులు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి గంగం ప్రేమ్‌నాథ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ కుటుంబానికి అండగా ఉంటా

అమెరికాల్లో ఉన్నత విద్యకోసం వెళ్లిన విద్యార్థి చంద్రశేఖర్ కుటుంబానికి అండగా ఉంటానని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ టీచర్స్ కాలనీ ఫేస్-2కు చెందిన పోలే చంద్రశేఖర్ కుటుంబాన్ని ఈటల రాజేందర్ గురువారం పరామర్శించి, ఓదార్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి, బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు వనపల్లి శ్రీనివాస్‌రెడ్డి, గంగం ప్రేమ్‌నాథ్, కాలనీ అధ్యక్షుడు కొట్ర శివ ముదిరాజ్, నరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించడం నైతిక బాధ్యత: టీటీఐ

కొత్తపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ట్రాఫిక్ నిబంధనలు పాటించడం అందరి నైతిక బాధ్యత అని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఇన్‌స్పెక్టర్ అర్జున్ తెపారు. గురువారం రామాంతపూర్ జడ్పీహెచ్ఎస్ నుంచి 41 మంది విద్యార్థులు ఎల్బీనగర్ ట్రాఫిక్ కాంప్లెక్స్‌లోని రాచకొండ పిల్లల ట్రాఫిక్ శిక్షణ పార్కును సందర్శించారు. తొలుత ఏఎస్ఐ సోమ్‌నాథ్, సేఫ్టీ ట్రెయినర్ ప్రవీణ్ పార్కు గోడలపై ఉన్న ట్రాఫిక్ నిబంధనల రంగురంగుల పోస్టర్లు, వాహనాల ప్రయాణానికి అవసరమైన సూచికలనూ చూపుతూ వాటిని వివరించారు. హెల్మెట్, సీట్‌బెల్టు ప్రాధాన్యతను గుర్తు చేశారు. నిబంధనల అవగాహనతో రహదారి భద్రతను పెంపొందిస్తారన్నారు. దారిభద్రతను నిర్ధారిస్తూ, ప్రమాదాలు, వాహనాలు నడిపే వారి గాయాలు తగ్గిండం ప్రధానలక్ష్యమని పేర్కొన్నారు. కూడళ్ల వద్ద వాహనాల రద్దీ నియంత్రణ వ్యవస్థ - సిగ్నల్స్ వాహనాలు సజావుగా ముందుకు సాగందుకేనన్నారు. కార్యక్రమంలో సిబ్బంది రమేష్ రోడ్డు ప్రమాదాల వీడియోలు, సందేశాత్మక గీతాలు ప్రదర్శించారు.

దిల్‌సుఖ్‌నగర్ డిపోలో ప్రగతిచక్ర అవార్డుల పంపిణీ



సిబ్బందికి ప్రగతి చక్ర అవార్డులను పంపిణీ చేస్తున్న ఆర్టీసీ హైదరాబాద్ ఆర్ఎం సుధా పరిమళ, పక్కన డిపో మేనేజర్ సమత తదితరులు

చాదర్‌ఘాట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో విధులు నిర్వహిస్తున్న పలువురు కార్మికులు గురువారం ప్రగతి చక్ర అవార్డులను అందుకున్నారు. డిపోలో జరిగిన కార్యక్రమంలో హైదరాబాద్ రీజినల్ మేనేజర్ సుధాపరిమళ ముఖ్యఅతిథిగా విచ్చేసి, ఆగస్టు, సెప్టెంబరులో ఈపీకే సాధించిన ఆరుగురు కండక్టర్లకు ప్రగతిచక్ర అవార్డులను పంపిణీ చేశారు. అదేవిధంగా కేఎంపీఎల్ సాధించిన మరో ఐదుగురు డ్రైవర్లు కూడా ఈ అవార్డులను అందుకున్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ రీజియన్ డిప్యూటీ ఆర్ఎం శంకర్, దిల్‌సుఖ్‌నగర్ డిపో మేనేజర్ సమత, అసిస్టెంట్ మేనేజర్ పావనీతోపాటు మెకానికల్ ఫోర్ మెన్, సూపర్‌వైజర్ మాధవవరం వెంకట నర్సింగ్‌రావు పాల్గొన్నారు.

చెట్టును నరికిన ఫ్లాట్ యజమానికి జరిమానా

వనస్థలిపురం, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ చైతన్యనగర్‌లో ప్రభుత్వ అనుమతులు లేకుండా గత సోమవారం భారీ వృక్షాన్ని కాలనీవాసులు నరికివేసిన విషయం తెలిసిందే. ఇట్టి చెట్టును నరికివేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సెంటర్ ఫర్ సోషియో కల్చర్ అండ్ ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ కార్యదర్శి సన్నీ హెరాక్లియస్ ఫారెస్ట్ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అటవీశాఖ అనుమతులు లేకుండా చెట్టును నరికిన సంఘటనపై ఇబ్రహీంపట్నం ఫారెస్ట్ అధికారులు గురువారం విచారణ చేపట్టి సదరు ప్లాటు యజమానికి రూ.10వేల జరిమానా విధించారు. అనంతరం వారు మాట్లాడుతూ అటవీశాఖ అనుమతులు లేకుండా చెట్లు నరికితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు.

యువకుడిపై గుర్తు తెలియని వ్యక్తుల దాడి

సైదాబాద్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడిపై గుర్తుతెలియని వ్యక్తులు సామూహిక దాడి చేయడంతో మాదన్నపేట పోలీసులు కేసు నమోదు చేశారు. బోయబస్తీకి చెందిన మల్లికార్జున్ బుధవారం రాత్రి ఫంక్షన్ వెళ్లి బైక్‌పై తిరిగొస్తున్నాడు. దోబీఘాట్ చౌరస్తా వద్ద అతివేగంగా ద్విచక్రవాహనంపై వెళ్తున్న యువకులను ఆపి మెల్లగా వెళ్లాలని సూచించాడు. అనంతరం ఇంటికి వచ్చి బయట కూర్చోని ఉండగా సుమారు 10 మంది గుర్తు తెలియని యువకులు బైక్‌లపై వచ్చి దాడిచేసి పారిపోయారు. ఈ ఘటనపై బాధితుడు మాదన్నపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు గతంలో కుర్మగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పనిచేశారు.

వాహనాల రద్దీని నియంత్రించడానికే ట్రాఫిక్ రూల్స్

కొత్తపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): వాహనాల రద్దీని నియంత్రించడానికే ట్రాఫిక్ నిబంధనల రూపకల్పన చేశారని రాచకొండ ట్రాఫిక్ ట్రెయినింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారు ఎస్ఐ నర్సింహారావుతో కలిసి ఆయన రాచకొండ పరిదజలోని 12 ప్రాంతాల్లో 590 మందికి అవగాహన కల్పించారు. అనంతరం వారు టీటీఐలో మాట్లాడారు. మీర్‌పేట్‌లోని 6 పాఠశాలల్లో, మన్సూరాబాద్ జడ్పీహెచ్ఎస్‌లో, బండ్లగూడ యూపీఎస్‌లో విద్యార్థులకు, వనస్థలిపురం, హస్తినాపురం సెంట్రల్, షిర్డీసాయినగర్ రోడ్‌లలో వాహనదారులకూ నిబంధనలు ఎందుకు వాటి ఉపయోగాలు తదితర అంశాలను గుర్తు చేశామన్నారు. సులభంగా నిబంధనలు అర్థమయ్యేలా కార్టూన్లు తెలుగు, ఇంగ్లిష్ వ్యాఖ్యలతో రూపొందించిన ఏబీసీ ఆఫ్ రోడ్ సేఫ్టీ రూల్స్ బుక్‌లెట్స్‌ను విద్యార్థులకు అందజేశామన్నారు.





ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన మురుగునీటితో నిండిన మిథిలానగర్‌కాలనీ

మురుగు నీటిలో మిథిలానగర్ కాలనీ

సరూర్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్ కార్పొరేషన్‌లోని మిథిలానగర్‌కాలనీ మరోసారి ముంపుబారిన పడింది. అయితే ఈసారి వర్షం నీటితో పాటు ఎగువ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున మురుగు నీరు సైతం వచ్చి చేరడంతో కాలనీ మొత్తం మురుగుమయమయింది. ఏ వీధిలో చూసినా మురుగు నీరే దర్శనమిస్తోంది. ఇక్కడి డ్రైనేజీ పైపులు, మ్యాన్‌హోళ్లు ధ్వంసమై మురుగు నీరు రోడ్లపైకి వస్తున్నా అధికారులు తగిన చర్యలు తీసుకోవడంలేదని స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఓపెన్‌జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

చంపాపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): సంపూర్ణ ఆరోగ్యం కోసం కాలనీ ప్రజలు ఓపెన్ జిమ్‌ను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ వంగా మధుసూదన్‌రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్‌లోని దుర్గాభవానీనగర్ కాలనీలో జీహెచ్ఎంసీ నిధులు రూ.37లక్షలతో చేపట్టనున్న సీసీ రహదారి నిర్మాణ పనులకు శంకుస్థాపన, మారుతీనగర్‌కాలనీ పార్కులో రూ.9.5లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను ఆయా కాలనీ ప్రతినిధులతో కలిసి గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ చంపాపేట డివిజన్‌లోని అన్ని ప్రాంతాలను దశలవారీగా అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తూ ముందుకు సాగుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పోరెడ్డి రవీందర్‌రెడ్డి, దుర్గాభవానీకాలనీ అధ్యక్షుడు లట్టుపల్లి రమేష్‌రెడ్డి, ఉపాధ్యక్షులు వెంకట్, ప్రధానకార్యదర్శి నిషికాంత్‌రెడ్డి, మారుతీనగర్ కాలనీ అధ్యక్షుడు జనార్ధన్‌రెడ్డి, ఆయా కాలనీల ప్రతినిధులు ఓంరెడ్డి, శంకర్, కృష్ణ, ధర్మారెడ్డి, కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, నగేష్, రాజు, బలరాం కృష్ణ, బలరాంరెడ్డి, పవన్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.



దుర్గాభవానీనగర్ కాలనీలోకాలనీ ప్రతినిధులతో కలిసి పర్యటిస్తున్న కార్పొరేటర్ వంగా మధుసూధన్‌రెడ్డి

దివ్యాంగుల సదనాన్ని పరిశీలించిన అధికారులు



దివ్యాంగుల సమస్యలు తెలుసుకుంటున్న దివ్యాంగ సంక్షేమ శాఖ సూపరింటెం డెంట్ మహ్మద్, అధికారులు

హైదరాబాద్‌సిటీ, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): చంపాపేట దివ్యాంగ బాలుర సదనంలో నాసిరకం ఆహారం వండినట్లు ఆరోపిస్తూ నిరసన తెలపడంతో అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. సంబంధిత అధికారులు చంపాపేట దివ్యాంగ వసతిగృహాన్ని సందర్శించి వారితో మాట్లాడి సమస్యలను గురించి అడిగి తెలుసుకున్నారు. ఈనెల 8న విద్యార్థులకు వండిన మాంసాహారం పూర్తిగా నాసికరంగా ఉందని ఆరోపిస్తూ భోజనం చేయకుండా నిరసనకు దిగారు. సమాచారమందుకున్న దివ్యాంగ సంక్షేమ శాఖ సూపరింటెండెంట్ మహ్మద్‌తోపాటు ఇతర అధికారులు చంపాపేటలోని దివ్యాంగుల సదనానికి తరలివచ్చారు. వండిన మాంసాహారాన్ని పరిశీలించి, నమూనాలను పరీక్షల కోసం ల్యాబ్‌కు పంపారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకొని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. వెంటనే కొత్త రెగ్యులర్ వార్డెన్‌ను నియమించారు. ఇకపై ఎలాంటి సమస్యలు వచ్చినా పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

ఫత్తుల్లాగూడ చెరువులో డ్రైనేజీ కలవొద్దు

మన్సూరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): ఫత్తుల్లాగూడ చెరువులోకి అక్రమంగా డ్రైనేజీ లైన్‌ను కలపాలని చూస్తున్నవారిని, అడ్డుకుంటుంటే వారు బెదిరిస్తున్నారని ఫత్తుల్లాగూడ గ్రామ యువజన సంఘం సభ్యులు పేర్కొన్నారు. ఈ మేరకు నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీకి గురువారం వారు ఫిర్యాదు చేసి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఇన్‌స్పెక్టర్‌కు వినతిపత్రం చ్చారు. ఈ కార్యక్రమంలో కాటేపాక రవికుమార్, కాటేపాక కిషన్, కె.చందు, కె.బాలకృష్ణ ఉన్నారు.



ఇన్‌స్పెక్టర్ మక్బూల్ జానీకి ఫిర్యాదు చేసిన ఫత్తుల్లాగూడ యువజన సంఘం సభ్యులు

రహదారుల సమస్యల పరిష్కారానికి చర్యలు



పనులను ప్రారంభిస్తున్న మల్‌రెడ్డి రాంరెడ్డి, కార్పొరేటర్ పవన్‌కుమార్

కొత్తపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): రహదారుల సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రోడ్డు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ పవన్‌కుమార్ అన్నారు. ఆర్టీసీ కాలనీ రోడ్-2, 4లలో 75 లక్షలతో చేపడుతున్న రోడ్ల నిర్మాణ పనులకు గురువారం వారు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మల్‌రెడ్డి రాంరెడ్డి మాట్లాడుతూ పార్టీలకతీతంగా కాలనీల్లో అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. కార్పొరేటర్ పవన్ కుమార్ మాట్లాడుతూ అభివృద్ధి పార్టీలకతీతంగా జరిగేలా కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. న్యూ నాగోల్‌లో సమస్యలను తెలుసుకునేందుకు కార్పొరేటర్ పవన్‌కుమార్‌పర్యటించారు. రోడ్ నెం.1లో డ్రైనేజీ మ్యాన్‌హోల్ నిండిపోయి మురుగు దారిపైకి చేరుతుండడం గమనించారు. సమస్య పరిష్కారానికి సత్వర చర్యలు తీసుకోవాలని జలమండలి అధికారులను ఆదేశించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ



ఓటు చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణలో టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి, యువజన కాంగ్రెస్ నేత ఉపేందర్‌రెడ్డి

ఎల్బీనగర్, అక్టోబర్ 9 (ఆంధ్రజ్యోతి): బీజేపీ ఓటు చోరీకి పాల్పడి ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసిందని టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశాల మేరకు మహేశ్వరం నియోజకవర్గం పరిధిలోని ఆర్‌కేపురం డివిజన్ ఎన్టీఆర్‌నగర్‌లో ఓటు చోరీకి వ్యతిరేకంగా గురువారం సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ రాష్ట్ర నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, గట్ల రవీంద్ర, మాజీ కౌన్సిలర్ ఢకియార్ నాయక్, ఖిల్లామైసమ్మ దేవాలయ చైర్మన్‌సురేష్, రాజు నాయక్, పగడాల ఎల్లయ్య, అక్బర్, అల్లాఉద్దీన్ పటేల్, కళ్యాణ్, సమద్, దుబ్బాక శేఖర్, పెద్దపూర సైదులు తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక కృషి

- తెలంగాణ విద్యా కమిషన్ సభ్యుడు వెంకటేష్
- బాటసింగారం జోనల్ స్థాయి కబడ్డీ పోటీలు ప్రారంభం



క్రీడాకారులతో కబడ్డీ ఆడుతున్న విద్యాకమిషన్ సభ్యుడు వెంకటేష్



కబడ్డీ పోటీలను ప్రారంభించిన అనంతరం క్రీడాకారులతో విద్యాకమిషన్ సభ్యుడు వెంకటేష్ తదితరులు

అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): క్రీడల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుంటుందని తెలంగాణ రాష్ట్ర విద్యాకమిషన్ సభ్యులు చారకొండ వెంకటేష్ అన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హయత్‌నగర్ జోనల్ స్థాయి కబడ్డీ పోటీలను గురువారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలం బాటసింగారం జడ్పీహెచ్ఎస్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసాన్ని పెంపొందిస్తాయని అన్నారు. నేను కబడ్డీ క్రీడాకారుడిని అని చెప్పారు. ఉపాధ్యాయులు సిలబస్ పూర్తి చేయడంపైను దృష్టి పెట్టకుండా విద్యార్థులకు చదవడం, రాయడం, గణిత ప్రక్రియలు వచ్చేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పెటా అధ్యక్షుడు రాఘవరెడ్డి, హయత్‌నగర్ జోనల్ సెక్రెటరీ నిర్మల, పీడీలు చంద్రమోహన్, వెంకటేశ్వర్లు, నర్సింహరావు, ఉషాకిరణ్, హెచ్ఎం దాసరి ప్రతాప్, వ్యాయామ ఉపాధ్యాయుడు సోలపోగుల స్వాములు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు సీపీసీ మిధానీలో 'డయల్ యువర్ డీఆర్ఎం'

చంపాపేట, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): కంచన్‌బాగ్‌లోని మిధానీ బస్ డిపో ఆవరణలోని సీపీసీ హయత్‌నగర్ డివిజన్ డిప్యూటీ రీజినల్ మేనేజర్(ఆపరేషన్స్)కార్యాలయంలో శుక్రవారం సాయంత్రం 4 నుంచి 5గంటల వరకు డయల్ యువర్ డీఆర్ఎం ప్రోగ్రాంను నిర్వహిస్తున్నట్లు డీఆర్ఎం(ఆపరేషన్స్)ఎన్.మాధవి తెలిపారు. డివిజన్ పరిధిలోని బండ్లగూడ, దిల్‌సుఖ్‌నగర్, హయత్‌నగర్-1, హయత్‌నగర్-2, ఇబ్రహీంపట్నం, మిధానీ, మహేశ్వరం ఆర్టీసీ బస్ డిపోల పరిధిలోని ప్రయాణికులు, కాలనీవాసులు ఈ కార్యక్రమంలో పాల్గొని తమ విలువైన సూచనలు, సలహాలను సెల్ నెంబర్ 9959226136కు తెలుపాలని డీఆర్ఎం ఎస్.మాధవి కోరారు.

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలి



కుట్టులో శిక్షణ పొందుతున్న మహిళలతో బీఆర్ఎస్ యువనేత రఘువీర్‌రెడ్డి, నిర్వాహకురాలు సారిక

మన్సూరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఇంటికే పరిమితం కాకుండా స్వయం ఉపాధి రంగాలను ఎంచుకుని తమతమ కుటుంబాలు ఆర్థికంగా బలపడటంలో భాగస్వాములవ్వాలని బీఆర్ఎస్ మన్సూరాబాద్ యువనేత జక్కిడి రఘువీర్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఆర్టీసీకాలనీలో పీపుల్ సర్వీసెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని నిర్వాహకురాలు సారిక ఆహ్వానం మేరకు ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రఘువీర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళలకు ఉచితంగా కుట్టు శిక్షణ ఇచ్చి వారి ఆర్థిక ఎదుగుదలకు పాటుపడుతున్న పీపుల్ సర్వీసెస్ ట్రస్ట్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో కేకేఎల్ గౌడ్, బీఆర్ఎస్ నాయకులు కడారి వెంకటేశ్, నాగేంద్రచారి, దేవేందర్, కృష్ణ, సంతోష్ తదితరులు ఉన్నారు.

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి కృషి



అధ్యక్ష, ప్రధానకార్యదర్శులకు నియామక పత్రాలు అందజేస్తున సంఘం నేత అనంతయ్య

చాదర్‌ఘాట్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు జాతీయ భవన నిర్మాణ కార్మికుల సేవా సంఘం ప్రధానకార్యదర్శి బి.అనంతయ్య అన్నారు. గురువారం నాడిక్కడ జరిగిన కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రాంతాలకు నియమించిన అధ్యక్ష, కార్యదర్శులకు ఆయన నియామక పత్రాలను అందజేశారు. ఇబ్రహింపట్నం, మునుగోడు నియోజకవర్గాల కమిటీ అధ్యక్షుడిగా దండుగుల రాజు, చౌటుప్పల్ మండలం అధ్యక్షునిగా బొజ్జస్వామి, అబ్దుల్లాపూర్‌మెట్ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు గుండె రంగయ్య, ముద్దంగుల శివశంకర్, హయత్‌నగర్, మండల అధ్యక్షుడు మార్ల నర్సింహ్మతోపాటు పలు జిల్లాలకు అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా నియమిస్తూ నియామకపత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘం గ్రేటర్ ఆర్గనైజింగ్ సెక్రెటరీలు వై.శ్రీనివాస్, ఎస్.మహేష్‌తోపాటు అనేక మంది పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు ఏడు రోజుల జైలు



సంతోష్‌నగర్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతలకు వ్యతిరేకంగా అర్ధరాత్రి అనుమానాస్పదంగా రోడ్లపై తిరుగుతున్న రౌడీషీటర్‌ని ఐఎస్‌సదన్ పోలీసులు అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం.. మాదన్నపేట శ్రీనగర్‌కాలనీకి చెందిన ఇస్టియాక్ ఉర్ రహ్మాన్ ఖురేషీ(23) రౌడీషీటర్, కొంతకాలంగా పోలీసులకు చిక్కకుండా తిరుగుతున్నాడు. బుధవారం అర్ధరాత్రి అనుమానాస్పదంగా రోడ్ల పై తిరుగుతుండడంతో అతడిని ఐఎస్‌సదన్ పెట్రోలింగ్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఇతని పై ఈ పెట్టీ కేసు నమోదుచేసి గురువారం స్పెషల్ మెట్రోపాలిటన్ కోర్టులో హాజరు పర్చగా న్యాయమూర్తి 7రోజులు జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.



ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద కాన్షీరాం ఫ్లెక్సీ వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నాయకులు

బీఎస్పీ వ్యవస్థాపకుడు కాన్షీరాంకు నివాళి

మన్సూరాబాద్, అక్టోబరు 9 (ఆంధ్రజ్యోతి): బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరాం వర్ధంతిని ఆ పార్టీ ఎల్బీనగర్ నియోజకవర్గ అధ్యక్షుడు వేముగంటి సంపత్ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఎల్బీనగర్‌లోని మహనీయుల విగ్రహాల వద్ద నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా బీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి గుండెల ధర్మేందర్ విచ్చేసి కాన్షీరాం చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు కాటేపాక రమేష్, బండారి రవికుమార్, గువ్వల సాయిరామకృష్ణ ముదిరాజ్, మంత్రి జగన్, జెమిని శ్రీనివాస్‌కురుమ, కుమార్, జల్లేపల్లి శశికుమార్, నల్ల నాగరాజు, ఎండీ సిరాజ్ తదితరులు ఉన్నారు.